మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# అర్హులందరికీ త్వరలోనే రేషన్ కార్డులు

- రేషన్ కార్డుల జారీకి క్యాబినెట్ ఆమోదం
- ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 1 ప్రభాతవార్త :** గత పది ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డు లేక నిరుపేదలు ఎంతగానో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నేడు అర్హులందరికి రేషన్ కార్డుల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో రేషన్ కార్డుల పంపిణీకి వెంటనే చర్యలు చేపట్టేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన తెలిపారు. నిరుపేద కుటుంబాలో అతి కీలకంగా ఉపయోగపడే రేషన్ కార్డులు లేక చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి త్వరలోనే రేషన్ కార్డులు అందుతాయని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుపరుస్తుందని ఎవరు ఎక్కడ కూడా నిరుత్సహానికి గురి కాకూడదని అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని ఆయన వివరించారు. అన్నదాతల నడ్డి విరిచేందుకు గత పాలకులు ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు భూమాతగా మారుస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. ఇక పై అన్నదాత భూ సమస్యల పరిష్కారానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరించుకోవచ్చునని ఆయన వివరించారు.



ఎమ్మెల్యే మేఘారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణరావు,ఎమ్మెల్యేలు కృష్ణ మోహన్ రెడ్డి ,మధుసుధన్ రెడ్డి

# కాంగ్రెస్ పార్టీలోనే బండ్ల

- గద్వాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజి నెట్టెంపాడు రిజర్వాయర్‌ల మరమ్మత్తులకు ప్రత్యేక నిధులు
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**గద్వాల,ఆగస్టు 1,ప్రభాతవార్త:** గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని రాష్ట్ర టూరిజంశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు .గద్వాల నియోజకవర్గ అభివృద్ధి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా నిధులు ఇచ్చేందుకు సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్ల మరమ్మత్తులకు ,రోడ్ల మరమ్మత్తులకు కూడా నిధులు ఇచ్చేందుకు సిఎం హామీ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు . గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ మార్పు వ్యవహారం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఇంటి దగ్గర మంత్రి జూపల్లి కృష్ణారావు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధు సూదన్ రెడ్డిలు విలేకరులతో మాట్లాడారు మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రధాన పత్రికల్లో మీడియాలో సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవం అని ఖండించారు.అసెంబ్లీ లాబీల్లో ఇంతకు ముందు పరిచయం ఉన్న వారితో మాట్లాడడం తప్పేం కాదు,అలా మాట్లాడినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు కాదు మంత్రి జూపల్లి అన్నారు .
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సింగిల్ విండో చైర్మన్ సుబాన్,మురళి,బండ్ల చంద్ర శేఖర్ రెడ్డి,పటేల్ ప్రభాకర్ రెడ్డి ,మాజీ ఎంపిపిలు రాజారెడ్డి,ప్రతాప్ గౌడ్,విజయ్ కుమార్,సత్యారెడ్డి ,గడ్డం కృష్ణా రెడ్డి,రఘు రెడ్డి,మాజీ చైర్మన్ వేణుగోపాల్,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ -10 సక్సెస్

- జిల్లాలో 46 మంది బాల కార్మికులకు విముక్తి
- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 1 ప్రభాతవార్త :** బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం జిల్లా పరిధిలో ఒక సెట్ -ఇన్స్పెక్టర్, ముగ్గురు కానిస్టేబుల్స్, ఒక మహిళ కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా కేటాయించి చైల్డ్ లైన్ తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం జులై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ -10 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది. ఇందులో 46 మంది బాలకార్మికులను గుర్తించి సిడబ్ల్యూసి (చైల్డ్ వెల్ఫర్ కమిటీ) ముందు హాజరుపర్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నదని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతయుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుంది. అని అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయ బడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరు అని తెలిపారు. బాలకార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ ముస్కాన్ -ఐఎక్స్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అదికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# స్వచ్ఛదనం.. పచ్చదనం విజయవంతం చేయాలి

- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి
- పాల్గొన్న మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కలెక్టర్లు



వీసీకి హాజరైన కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ప్రతి పల్లె, పట్టణాల్లో స్వచ్ఛ దనం... పచ్చదనం కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి రాష్ట్ర స్థాయి ఉన్నతాధి కారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛదనం, పచ్చదనంపై జిల్లా కలెక్టర్లకు ఆమె దిశా, నిర్ధేశం చేశారు. ఈ వీడియో సమావేశంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లు విజయేంద్ర బోయి, బదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా అధికారులు, ఆయా జిల్లాల కలెక్టరేట్ల నుంచి వీడియో సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, జిల్లా కలెక్టర్లతో మాట్లాడుతూ గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత మరియు పచ్చదనాన్ని నిర్ధారించడం ద్వారా రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి ఆగస్టు 5 నుంచి ఆగస్టు 9వరకు 5 రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తలపించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు - మిగతా4లో..

# రూ.3500కోట్లు

# 145కి.మీ.

# వడివడిగా వికారాబాద్-కృష్ణ రైల్వే లైన్



- దక్షిణ తెలంగాణకు మరో మణిహారం..
- ఉమ్మడి జిల్లాలోని కొడంగల్, నారాయణపేట, మక్తల్‌కు ప్రయోజనం
- రూట్ మ్యాప్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు, సలహాలు..
- ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి
- త్వరలో పనుల పూర్తికి చర్యలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 1, ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. దక్షిణ తెలంగాణలో మరోమైలురాయిగా నిలువనున్న వికారాబాద్-కృష్ణ రైల్వే లైన్ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. సుదీర్ఘ కాలంగా నిర్లక్ష్యానికి గురైన ఈ మార్గాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు. ఇందులో భాగంగా రైల్వే అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రైల్వే అధికారులకు రూట్ మ్యాప్‌నకు సంబంధించి పలు సూచనలు సలహాలు అందించారు. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ అధికారులు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. ప్రధానంగా ఉమ్మడి పాలమూరులోని కొడంగల్,మక్తల్, నారాయణపేటకు నియోజకవర్గాలకు రాకపోకలు మరింత మెరుగుకానున్నాయి. ఉమ్మడి పాలమూరులో కొత్త రైల్వే లైన్ ఏర్పాటుపై ఆశలు మొలకెత్తుతున్నాయి. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు ప్రతిపాదనలు తయారు చేస్తుండడంతో త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. గత ప్రభుత్వంలో ముందుకు సాగని



వికారాబాద్-కృష్ణ రైల్వే లైన్ పనులపై సూచనలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి,వాకిటి శ్రీహరి

వికారాబాద్-కృష్ణ రైల్వే లైన్ యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. దక్షిణ తెలంగాణలో మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటులో కీలకంగా మారనున్న వికారాబాద్-కృష్ణ రైల్వే లైన్ రూట్ మ్యాప్‌పై ఇటీవలె సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈమేరకు అధికారులకు సీఎం పలు సూచనలు, సలహాలు అందించారు. వికారాబాద్ నుంచి కృష్ణా వరకు రూపొందించిన రైల్వే లైన్‌లో ప్రధానంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మేలు చేకూరనున్నది. ఇందులో కొడంగల్,మక్తల్, నారాయణపేట మీదుగా సుమారు 145 కిలోమీటర్లు మేర రైల్వే లైన్ ఏర్పాటు కానున్నది. ఇందుకుగాను ప్రభుత్వం రూ.3500కోట్ల అంచనా వ్యయం కానున్నట్లు డీపీఆర్‌లో పేర్కొన్నారు. రైల్వే లైన్ ప్రణాళికలను వడివ డిగా పూర్తి చేయాలని, పనులు త్వరిగతగిన ప్రారంభిం చాలని సీఎం ఆదేశించారు. ఈమేరకు గత సోమవారం సచివాలయం విరామ సమయంలో రైల్వే అధికారులతో సీఎం సమీక్షించారు. రైల్వే సీఈ సుబ్రహ్మణ్యన్, సీఎంవో కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, నారాయణపేట, మక్తల్, పరిగి ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి,వాకిటి శ్రీహరి, రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి సీఎం చర్చించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్

వికారాబాద్-కృష్ణ రైల్వే లైన్ ప్రాజెక్టు కోసం ఇప్పటికే ఫైనల్ లోకేషన్ సర్వేకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. గతంలో నారాయణపేట జిల్లా కృష్ణా నుంచి వికారాబాద్‌కు 87కి.మీ.మేరకు రూ.90కోట్లతో ప్రతిపాదనలు చేసినా కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. కేంద్రం రాష్ట్రం 50:50 శాతం నిధులు కేటాయించాల్సి ఉండడంతో గత ప్రభుత్వం తన వాటా నిధులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. కొత్త ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులపై ఫోకస్ పెంచింది. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో నిర్దేశించిన మార్గాల్లో కాంకుడా సీఎం రేవంత్‌రెడ్డి కొంత సూచనలు సలహాలు అందజేయడంతో రైల్వే లైన్ కసరత్తు ప్రారంభమైంది.



### గతంలో పట్టించుకోలేదు..

వికారాబాద్- కృష్ణ రైల్వే లైన్ నిర్లక్ష్యం చేశారు. గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు పెద్ద ఎత్తున చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైల్వే అధికారులు, నాతోపాటు నారాయణపేట, పరిగి ఎమ్మెల్యేలతో కలిసి రూట్ మ్యాప్‌పై సమీక్షించారు. అతి త్వరలోనే పనులు పూర్తి చేద్దామనే ఆలోచనతో సీఎం ముందుకు వెళ్తున్నారు. ఇది అతిపెద్ద ప్రాజెక్టు. 145కి.మీ. పొడవుతో రూ.3500కోట్లతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది.

**- వాకిటి శ్రీహరి, శాసనసభ్యులు, మక్తల్**



మహబూబ్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

# సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసన

- మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఉమ్మడి జిల్లాలో నిరసనలు
- ధర్నా, రాస్తారోకోలు చేపట్టిన పార్టీ శ్రేణులు
- సీఎం డౌన్ డౌన్ నినాదాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 1,ప్రభాతవార్త:** అసెంబ్లీలో మహిళా సభ్యులపై సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశం మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు రాస్తారోకో, ధర్నా నిర్వహించా రు. నిరసనగా గురువారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు సిఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే పూ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వెంటనే బిఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలతో పాటు తెలం గాణలో ఉన్న మహిళ లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరాస్తాలో మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ మహబూబ్‌నగర్ పట్టణాధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్లు వనజ,గణేష్, నాయకులు వసుంధర, నవకాంత్,సాయిలు, సుధాకర్,ప్రభాకర్, చారి,ప్రతాప్‌నాయక్, భాస్కర్ పాల్గొన్నారు. జడ్చర్లలోని సిగ్నల్ గడ్డ వద్ద ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సీఐ ఆదిరెడ్డి తన సిబ్బందితో కలిసి ధర్నా వద్దకు చేరుకున్నారు. నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకోతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో సీఐ ఆదిరెడ్డి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైరన్‌కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ సారికారామ్మోహన్, మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, కౌన్సిలర్లు నవనీత కిరణ్, చైతన్య, శ్రీశైలమ్మ, - మిగతా4లో..



గద్వాలలో సీఎం దిష్టిబొమ్మను దగ్దం చేసిన బిఆర్ఎస్ నాయకులు

# సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- ఇది చారిత్రాత్మక తీర్పు
- కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేరువతోనే సాధ్యం
- మూడు దశాబ్దాల కల నెరవేరింది
- మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ



**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీం ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పుపై బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపి అరుణమ్మ హర్షం వ్యక్తం చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానంఇచ్చిన ఈ తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ గొప్ప తీర్పు ఇచ్చిన నా యయమూర్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చొరవతోనే ఎస్సీల 30 ఏళ్ల కల నెరవేరిందన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలించిందని, ఎన్నికలకు ముందు ప్రధాని మోడీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతగానో కృషి చేశారని చెప్పారు. బిజెపి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తీసేస్తారంటూ తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఇవాళ సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు చెంపపెట్టు లాంటిదని ఫైరయ్యారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పు అనడానికి ఈ తీర్పు ఉదాహరణ అని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించి ఆ వర్గాల చిరకాల కల నెరవేరేలా కృషి చేసిన ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డి, డికె అరుణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగను గత ప్రభుత్వాలు మోసం చేస్తే బిజెపి ఇచ్చిన మాటను నిలుపుకుందని తెలిపారు. ఈ దేశంలోనే షెడ్యూల్డు కులాల అభివృద్ధి, అభ్యున్నతి బిజెపితోనే సాధ్యమని ఈ విషయం ఈ తీర్పుతో మరోసారి రుజువైందన్నారు. ఎస్సీ వర్గీకరణ క్రెడిట్ పూర్తిగా బిజెపిదే. ఈ విషయంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రభుత్వాలు చేసిందేమి లేదని పేర్కొన్నారు. ఈ తీర్పుతో ఎస్సీ సామాజిక వర్గాలకు మేలు జరుగుతుందని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

## కల్వకుర్తి వాసి ప్రసన్నకు డాక్టరేట్..

- డిండి ప్రాజెక్టు జల జీవరాసులపై పరిశోధన
- అభినందనలు తెలుపుతున్న కల్వకుర్తి వాసులు



**కల్వకుర్తి, ఆగస్టు 01 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటికి చెందిన అల్లాడి ప్రసన్న జంతు శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పొందారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ ఆమె జంతు శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ ప్రసన్న ఊర్కొండపేటలో ప్రాథమిక విద్య, కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, జడ్చర్లలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో జువాలజీలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ జువాలజీ పూర్తి చేసిన ప్రసన్న అదే యూనివర్సిటీలో జుప్లాంటిక్ డైవర్సిటీ అండ్ కెమికల్ క్వాంటిటీస్ విభాగంలో డాక్టర్ చేశారు. కోటి మహిళా కళాశాలలో అసిస్టెంట్ ప్రొపెసర్ నీరజ ఆధ్వర్యంలో ప్రసన్న జూప్లాంటికల్ డైవర్సిటి అండ్ ఫీజికో కెమికల్ క్యాంటీటీస్ పరిశోధన చేశారు. నల్గొండ జిల్లా డిండి ప్రాజెక్టులోని జూప్లాంటికల్ డైవర్సిటీ ఫిజికో కెమికల్ క్వాంటిటీస్ అనే పరిశోధనలను పూర్తి చేశారు. డిండి ప్రాజెక్టులోని జల చరాలు, నీటి మొక్కలు, శిలజాలు, కెమికల్ రసాయన చర్యలపై పరిశోధనలు చేసినందుకు గాను కల్వకుర్తి ప్రాంత విద్య అభిమానులు, కుటుంబ సభ్యులు ఆమెను అభినందిస్తున్నారు.

## అనుచిత వ్యాక్యాలు వెనక్కి తీసుకోవాలి



**పెబ్బేరు ఆగస్టు 1 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణ, మండల, టిఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో మహిళా ఎమ్మెల్యే ల పట్ల అనుచిత వ్యాక్యాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ మహిళ మీ అమ్మ ఒక మహిళ నే కాంగ్రెస్ పార్టీ ఆరు మంది ఎమ్మెల్యేలు కూడా మహిళలే మరి మహిళలను అనుచిత వ్యాఖ్యలతో మాట్లాడడం ఒక ముఖ్యమంత్రిగా నీకు తగునా మహిళా పట్ల ఆవిధంగా మాట్లాడడం బాధాకరమైన విషయం తక్షణమే నువ్వు మాట్లాడిన మాటలు వాపస్ తీసుకోవాల్సిందిగా పెబ్బేరు చౌరస్తాలో పట్టణ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి వనం రాములు ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ దహన కార్యక్రమంలో చైర్‌పర్సన్ కరుణ సాయి వైస్ చైర్మన్ కర్రెస్వామి మాజీ ఎంపీపీ రాజశేఖర్, కౌన్సిలర్ ఎల్లారెడ్డి, పార్వతి, మహేందర్ గౌడ్, కౌన్సిలర్ పద్మ వేణు, మేకల ఎల్లయ్య, సుమతి టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు విశ్వరూపం జడ్పిటిసి వెంకటేశ్ మాలపల్లె మాజీ ఎంపిటిసి మొగులయ్య, కంచరపల్లి ఎంపిటిసి మరాఠీ మన్యం నాయుడు, కోమటి రాము, వడ్డే నరేశ్, తెలుగు గణేష్ , వడ్ల సేకరాచారి, వేణుగోపాల్, తెలంగాణ ఉద్యమకారులు వల్లపు రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకటన్న గౌడ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జన్మదినం సందర్భంగా అన్నదానం..

**గద్వాల,ఆగస్టు 1,ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గద్వాల తిరుపతి దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో ఓం శ్రీ అన్న పూర్ణేశ్వరి దేవియే నమో గురువారము గద్వాల పట్టణం చెందిన తెలంగాణ షూ మార్ట్ యజమాని సయ్యద్ యూసఫ్ జన్మదిన సందర్భంగా అన్న దాన కార్యక్ర మం నిర్వహించారు . యూసఫ్ కుమారులు అబ్బు అన్వర్,రహన్ ఆధ్వర్యంలో ఆ స్పత్రుల్లో ఉన్న రోగులకు అన్న దాన కార్యక్రమం చేపట్టారు.ప్రతి సంవత్సరం జన్మదినము రోజున అందుల పాఠశాలలో,ఆసుపత్రుల్లో రోగులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్వర్ తెలిపారు .అనంతరం అబ్బు అన్వర్‌కు ట్రస్ట్ సభ్యులు శాలువాతో సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ట్రస్టు నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు .



## కొత్త ప్రభుత్వాన్ని నిందించడం తగదు..



**పెబ్బేరు ఆగస్టు 1 ప్రభాతవార్త:** నిన్నటి రోజున మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి పెబ్బేరు మండలం పర్యటనలో భాగంగా గుమ్మడం, పాతపల్లి గ్రామాల్లో గల అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ లను సందర్శించి ఇంకా పూర్తి కాలేదని విమర్శలు చేయడం తగదని పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ 2021వ సంవత్సరంలో శంకుస్థాపన చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు తమ ప్రభుత్వం పూర్తి చేయవలసింది. పోయి, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాన్ని నిందించడం తగదని గుమ్మడం గ్రామంలో మంజూరు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులతో సంబంధిత కాంట్రాక్టర్లు డబ్బులు వసులు చేస్తారని ఇలాంటి కార్యకలాపాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరగవని అభివృద్ధి విషయంలో సలహాలు ఇస్తే స్వీకరించడానికి సిద్దంగా ఉన్నామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్, మాజీ సర్పంచులు, సురేందర్‌గౌడ్,రవీందర్ నాయుడు, మండలం సీనియర్ నాయకులు దయాకర్ రెడ్డి, రాములు యాదవ్,మేస్త్రి రాములు, రంగన్న యాదవ్, కె.రాములు, బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దొడ్డి ప్రాథమిక పాఠశాలలో హెల్త్ క్యాంప్



**మల్దకల్ ఆగస్టు 1,ప్రభాతవార్త:** నేడు రాష్ట్రీయ బాల స్వస్తత కార్యాక్రమములో భాగంగా మెడికల అఫిసర్లు డాక్టర్లు విజయకాంత్ ,సమీనా కౌజర్‌ల ఆధ్వర్యంలో పెద్దదొడ్డి ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది.విద్యా ర్థులందరిని క్షుణ్ణంగా పరిశీలిం చి అవసరమైన వాళ్లకు ఐరన్ టానిక్,విటమిన్ టాబ్లెట్స్ పం పిణీ చేయడం జరిగింది.కొందరి విద్యార్థుల గాయలకు డ్రెస్సింగ్ చేసి అయింట్మెంట్ పూశారు ఐదుగురిని మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు .వాన కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తూ తీసుకొవల్సిన జాగ్రత్తలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మస్టర్ వెంకటయ్య ఉపాధ్యయులు నాగరాజు,దస్తగిరి ,ఎఎన్ఎం ఊర్మిళ గ్రామస్తులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# 30 ఏండ్ల పోరాటానికి తెరపడింది..

- ఎస్సి ఎస్టీ వర్గీకరణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్
- మంద కృష్ణ మాదిగ పోరాటం ఫలించింది
- ఎస్సి ఎస్టి వర్గీకరణ హర్ష వ్యక్తం
- ఉమ్మడి జిల్లాల ఎంఆర్‌పిఎస్ మాజీ అధ్యక్షుడు మిషేక్

**కొత్తకోట ఆగష్టు 1 ప్రభాతవార్త :** మాదిగ రిజర్వేషన్ పోరాటం సమితి భుజాన వేసుకొని 30 ఏండ్లు విరామం లేకుండా మంద కృష్ణ మాదిగ పోరాటానికి ఫలితమే ఎస్సి ఎస్టీ వర్గీకరణ అమలు అని గురువారం సుప్రీం కోర్టు ఎస్సి ఎస్టీ వర్గీకరణ పై గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఉమ్మడి జిల్లాల ఎంఆర్‌పిఎస్ మాజీ అద్యక్షులు జెయం మిషేక్ సంతోషం వ్యక్తం చేశారు. గురువారం కొత్తకోటలో ఎంఆర్‌పిఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఈ వర్గీకరణ సాధ్యం అయిందని అన్నారు. వర్గీకరణ పోరుబాటలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు.మంద కృష్ణ మాదిగ ఎస్సి వర్గీకరణ కోసం ఎక్కడ ధర్నాలు, నిరసనలు, రాస్తారోకలు, రోడ్‌షోలు, సభలు ఏర్పాటు చేసిన పెద్ద ఎత్తున తరలివెల్లి విజయవంతం చేశామని గుర్తు చేశారు. ఎస్సి వర్గీకరణ కోసం కష్టపడిన, అండగా నిలిచిన నా జాతి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉద్యమం కోసం గజ్జెకట్టి గ్రామాల్లో మండలంలో ఆటపాటలతో నా జాతీని మేల్కోపామని అన్నారు. విద్యాపరంగా, రాజకీయపరంగా, ఆర్థికంగా వెనకబడి ఉన్న జాతికి నిజమైన స్వాతంత్ర్యం ఈ రోజు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో ఎస్సిలు అవమానపడ్డారని నిరాశకు నిస్పృహకు గురైన నా జాతి ఈ రోజు తలెత్తకునేలా రిజర్వేషన్ అమలు అయ్యాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఎస్సి ఎస్టి వర్గీకరణ అమలును స్వాగతిస్తున్నామని చెప్పి ముందుగా తెలంగాణలో రిజర్వేషన్ ను అమలు చేస్తామని చెప్పడం గొప్పవిషయమన్నారు. అవసరమైతే ఆర్డినేన్స్ తెచ్చాయినా రిజర్వేషన్ అమలుకు సిద్దమని ఇప్పుడున్న ఉద్యోగ నియమాకాల్లో ఎస్సి ఎస్టి వర్గీకరణ రిజర్వేషన్ లు అమలు చేస్తామని చెప్పడం సంతోషించదగ్గ విశయమన్నారు. సుప్రీం కోర్టు తాజా తీర్పును తెలుగు రాష్ట్రాలలో విద్య, ఉద్యోగ నియామకాల్లో అమలు చేయాలన్నారు. ప్రభుత్వం దగ్గర ఎస్సి ఎస్టీ జనాభా లెక్కలు ఉన్నాయని వర్గీకరణ కు సంబంధించిన జీఓలో వచ్చిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్ లు ఇవ్వాలని ఉద్యోగ నోటిఫికేషన్ లు సరిచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రీ నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. 30 ఏండ్లు విరామం లేకుండా ఉద్యమానికి ఊపిరిపోస్తూ ముందుకు నడిపించిన మా నాయకుడు మంద కృష్ణకు ప్రత్యేక దన్యవాధములు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు సూజ్ఞానం, రత్నం. జయరాజు, సాయిలు, కుర్మయ్య, లక్ష్మణ్, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిషేక్

## ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి..

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ధర్నా

**అమరచింత ఆగష్టు 1 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అమరచింత మండల తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి, రాజన్న, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు సి రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికలలో ఇంటి స్థలం ఉన్న ప్రతి పేదవారికి ఐదు లక్షల మంజూరు చేస్తానని వాగ్దానం , చేసిన ఇప్పటివరకు ఇండ్లు మంజూరు చేయడం లేదని, అలాగే గత పది ఏళ్లుగా రేషన్ కార్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ 18 సంవత్సరాల నిండిన మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పిన ఇప్పటివరకు మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు పెన్షన్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో పెన్షన్లు రూ.4000 ఇస్తామని మాట ఇచ్చిన ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం లేదని వారన్నారు. బీడీ కార్మికులకు పిఎఫ్‌కు సంబంధం లేకుండా జీవన భృతి ఇవ్వాలని భవన నిర్మాణ కార్మికులకు ఆసరా పెన్షన్లు వర్తింపజేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని వారి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన పెట్టుబడి కోసం తక్షణమే బ్యాంక్ అధికారులు రైతు భరోసా ఇవ్వాలని కౌలు రైతులకు గుర్తింపు ఇవ్వాలని, పది ఎకరాల ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామేలు, కురుమన్న,భక్తరాజ్, మురళి, ఏసన్న, జగదీష్ లక్ష్మి , రాజు, శ్రీను సుధాకర్ , రాజు తదితరులు పాల్గొన్నారు.



అమరచింత మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ధర్నా చేస్తున్న కార్మికులు

## బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు అభినందనలు



**గద్వాల, ఆగస్టు1, ప్రభాతవార్త:** గద్వాల మండలానికి నూతన తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన కురుణాకర్‌కు తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాల శ్రీనివాస్ మేస్త్రి కృష్ణ వేణుగోపాల్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గద్వాల మండలంలో కుల ఆదాయ సర్టిఫికెట్ జారిలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయని,కుల సర్టిఫికెట్ల అప్లికేషన్లను పూర్తిగా పరిశీలించి అట్టి సర్టిఫికెట్ల పంచులలో కచ్చితంగా దళిత కుల సంఘాల నాయకుల సంతకాలు,ఆయా వార్డుల కౌన్సిలర్ సంతకాలు తీసుకుని కుల సర్టిఫికెట్లు జారీ చేయాలని విన్నవించారు . ఈ విషయంపై తహసిల్దార్ సానుకూలంగా స్పందించారు .

## ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు కృతజ్ఞతలు తెలిపిన సరితమ్మ

**గద్వాల టౌన్, ఆగస్టు 01, ప్రభాతవార్త:** ఎస్సి,ఎస్టీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మాజీ జెడ్పి చైర్‌పర్సన్ , కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జి సరితమ్మ కృతజ్ఞతలు తెలిపారు .తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందని వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు హర్షం వ్యక్తం చస్తున్నాని ఆమె అన్నారు .సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుంటారని ,మాదిగ,మాల ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు .



## ఆత్మకూరులో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం..

**ఆత్మకూర్ ఆగష్టు 1 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో గురువారం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అంతకుముందుగా గాంధీ చౌరస్తా వరకు టిఆర్ఎస్ నాయకులు ప్రదర్శనగా తరలివచ్చి కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత కలిగిన వ్యక్తుల వ్యవహరించకుండా మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అసభ్య పదజాలంతో దూషిస్తూ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నాడని ఆత్మకూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ ,ఆత్మకూరు ఎంపీపీ బంగారు శ్రీనివాసులు తదితరులు తీవ్రస్థాయిలో గజమెత్తారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టబొమ్మను దహనం చేసేందుకు టిఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించడంతో ఆత్మకూరు ఎస్సై నరేందర్ పోలీస్ సిబ్బందితో తరలివచ్చి దిష్టిబొమ్మను దహనం చేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులకు మధ్య తొపులాట కొనసాగింది ఎట్టకేలకు టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రి పైసరతగా సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ బిఆర్ఎస్ నాయకులు వీరేశలింగం, రామకృష్ణ, శ్రీనివాసులు, అనిల్ కుమార్ ,ఆంజనేయులు తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిఆర్ఎస్ నాయకులు



టిఆర్ఎస్ నాయకులు పోలీసుల మధ్య తోపులాట జరుగుతున్న దృశ్యం

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన గొంగళ్ళ రంజిత్ కుమార్



**గద్వాల టౌన్, ఆగస్టు, ప్రభాతవార్త:** ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తున్నా మని,వర్గీకరణ సమర్ధనీయమని దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కలిపిస్తూ ఆదేశాలు జారీ చేసిన సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ తెలిపారు.దశాబ్దల నుంచి ఎస్సీ వర్గీకరణ సాధనకై కృషి చేస్తున్న పోరాట యోధుడికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కు శుభాకంక్షలు తెలియజేశారు .

## భవిష్యత్తు తరాల అభివృద్ధికి ఖాళా స్థలాలను కాపాడుకుందాం...

- కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, ఆగస్టు 01 ప్రభాతవార్త:** గతంలో కల్వకుర్తి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు చేసిన లేఔట్‌లలో వచ్చిన ప్లాట్లను, ఖాళీ స్థలాలను భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పేర్కొన్నారు. గురువారం ఆయన కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని ఖాళీ స్థలాలను సందర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్‌లు మాట్లాడుతూ పట్టణ పరిధిలో కల్వకుర్తి మున్సిపాలిటికి సంబంధించిన ఖాళీ స్థలాలను కాపాడుకుంటే రానున్న కాలంలో ప్రజా అవసరాలకు వినియోగించుకునే వీలుంటుందన్నారు. కల్వకుర్తి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు చేసిన లేఅవుట్లలో నిబంధనల ప్రకారం అనుమతి నిమిత్తం గ్రామపంచాయతీకి కేటాయించిన ఖాళీ స్థలములను భద్రపర్చుటకు మరియు అభివృద్ధి చేయుటకు పెన్సింగ్ వేయాలన్నారు. మున్సిపాలిటిలోని ఖాళీ స్థలాలను పరిరక్షించేందుకు మున్సిపాలిటి సిబ్బందికి చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్‌లు తగు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఖాళీ స్థలాలను పరిరక్షించి కంచెలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**పెబ్బేర్ ఆగష్టు1 ప్రభాతవార్త :** పెబ్బేర్ మున్సిపాలిటీ ఎన్ హెచ్ 44మోడల్ స్కూల్ దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అంబేద్కర్ నగర్‌కు చెందిన జి మధు సన్నాఫ్ వెంకటయ్య బాలమ్మకు ఇద్దరు కుమారులు వారి చిన్న కుమారుడు పెబ్బేర్‌లో ఫోటో స్టూడియోలో పనిచేస్తున్నాడు పనీ నిమిత్తం మాలపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమదావశాత్తు గుర్తు తెలియని వాహనం ఢీ కొని తలపై గట్టి దెబ్బలు తగలడంతో మెదడు చిట్లి అక్కడికక్కడే మరణించాడు. ఎన్‌హెచ్ అథారిటీ వారి అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పెబ్బేర్ ఎస్సై సిహెచ్ హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకొని ట్రాఫిక్ మొత్తం క్లియరెన్స్ చేశారు. రోడ్డు మరమ్మతులు దామర్ వేయడం వల్ల వన్ వే రోడ్డు చేసినందుకు రోడ్ ఇబ్బందిగా ఉంది యాక్సిడేంట్లు ఎక్కువైతున్నాయని ప్రజలు కోరుతున్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ ఘన సన్మానం

**కొత్తకోట ఆగష్టు 1 ప్రభాతవార్త :** కోత్తకోట మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాద్యక్షులు పల్లెపాగు ప్రశాంత్ ను మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించబోతున్న సందర్భంగా కానాయపల్లి గ్రామ నాయకులు అయన నివాసంలో కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం సీనియర్ నాయకులకు ఈ గౌరవం దక్కడం సంతోషంగా ఉందని నాయకులు తెలిపారు. ఇలాంటి పదవులు మరెన్నో స్వీకరించాలని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ నెల 11 వ తేదీన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం ఉందని గ్రామంలో అందరు పెద్ద ఎత్తున తరలి రావాలని పల్లెపాగు ప్రశాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రి, ప్రభుదాస్, గోకరయ్య, పురుషోత్తం, కుర్మయ్య, సాయిలు, ధనుష్, రవి, ఎలీషా, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానిస్తున్న నాయకులు

# సీఎం వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నిరసన





బిఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

**తెల్కపల్లి, ఆగస్టు 01 ప్రభాతవార్త :** అసెంబ్లీలో బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునిత లక్ష్మారెడ్డిల పట్ల బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి పిలుపు మేరకు మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో నిరసన తెలుపుతూ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నించడంతో విషయం తెలుకున్న స్థానిక ఎస్సై బి. నరేష్, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని దిష్టిబొమ్మ దగ్ధాన్ని అడ్డుకోగా అలాగే దగ్ధం చేయడంతో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు ప్రజల మన్ననలు పొందుతూ నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న ఇద్దరు సీనియర్ మహిళ ఎమ్మెల్యేలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మండల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు మాజీ ఎంపిపి బొమ్మసాని నర్సింహ, భాషమోని రాములు, సుందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గుజ్జ మాధవరెడ్డి, కోట్లశ్రీనివాసులు,మాజీ ఎంపిటిసిలు లక్ష్మమ్మ, రమేష్,గౌస్ మొయి నొద్దిన్, పట్టణ అధ్యక్షులు భాషమోని సత్యం, మండల యూత్ అధ్యక్షులు పర్వతాలు, పట్టణ ప్రధాన కార్యదర్శి భారీగారి రమేష్, భారీగారి సురేష్, చీమర్ల గోవర్ధన్‌రెడ్డి,శ్యామలయ్య,మహిళా నాయకురాలుఅవధాని సృజన సోషల్ మీడియా సభ్యులు రాకేష్,సాయిరాం, మాజీ సర్పంచ్‌లు విష్ణుసాగర్, జమ్ములు, ఎత్తపువిష్ణు,సుల్తాన్,వివిధగ్రామాలబిఆర్ఎస్‌నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు

**కోయిల్‌కొండ,ఆగస్టు 01 ప్రభాతవార్త:** అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను కించపరిచే విధంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి రాబోయే రోజులలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి. కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని స్వామి వివేకానంద చౌరస్తా ప్రాంతంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు నిరసన కార్యక్రమం చేపట్టారు. మహిళ ఎమ్మెల్యేల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సిఎం రేవంత్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంఘనోనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు టివి ఖాజా, పార్టీ సీనియర్ నాయకుడు దొరపల్లి నారాయణగౌడ్, నాయకులు రాజు, పులి నరసింహులు, చోటు, జి. శ్రీనివాసులు, ఆంజనేయులు, మోహిన్, పానుగంటి నగేష్, నరేష్, ఆనంద్, శివ, టివి రాఘవేందర్, వెంకట్‌నాయక్, రాము పాల్గొన్నారు.



**బిజినేపల్లి,ఆగస్టు 01 ప్రభాతవార్త :** అసెంబ్లీ సాక్షిగా ఆడబిడ్డలను అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మండల బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మల దగ్ధానికి యత్నించిన బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సభా సంప్రదాయాలు తుంగలో తొక్కుతూ ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. మందబలంతో కాంగ్రెస్ అనుసరిస్తున్న దురహంకారాన్ని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతిపక్షంగా డిమాండ్‌చేయడం తప్పా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, పులెందర్‌రెడ్డి, శేఖర్‌రావు, బాలస్వామి, తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులు,సాయి, ప్రశాంత్, శ్రీశైలం, భాష, బొందయ్య, నరసింహారెడ్డి, అల్లోజీ, రామకృష్ణ పాల్గొన్నారు.



**వెల్దండ, ఆగస్టు 01 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలు సబిత ఇంద్రారెడ్డి, సునిత లక్ష్మారెడ్డిలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు గురువారం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, జంగిలి యాదగిరి, కొండలుయాదవ్, వెంకటయ్య,అశోక్, ఆనంద్, శ్రీను, ప్రకాష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## రూరల్ స్టేషన్ పరిధిలో 4 సెల్ ఫోన్లో రికవరీ

**వనపర్తి రూరల్ ఆగస్టు 1 ప్రభాతవార్త :** వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమంది బాధితులు సెల్ ఫోన్లు చోరికి గురైనట్లు ఫిర్యాదు చెయ్యగా దానిపై విచారణ చేపట్టారు. వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి వివరాల ప్రకారంగా గత సంవత్సరంలో దాదాపుగా 34 ఫోన్లో పోయినట్లు ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్లో దరఖాస్తులు ఇవ్వడంతో, విచారణ చేపట్టిన ఫిర్యాదుదారుల వివరాల ప్రకారంగా సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా నాలుగు ఫోన్లను రికవరీ చేయడం జరిగింది. బాలపీరు. అర్జున్, జానయ్య, బాలరాజు, బాధితులకు అందించారు. రూరల్ ఎస్సై మాట్లాడుతూ వనపర్తి పట్టణంలో మొబైల్ షాపుల యజమానులకు తెలియజేస్తున్నాం. ఎవరైనా ఫోన్లను అమ్మినా గానీ కొన్న వారిపై కేసులు నమోదు చేస్తాం, ఎవరైనా మీ దగ్గరికి వస్తే ఖచ్చితంగా అతని దగ్గర సరైనదా కాదని తెలుసుకొని, తీసుకోవాలి అని తెలిపారు. పోలీసు వారు తప్పి పోయిన ఫోన్లో మీద దృష్టి సారిస్తాం. మిగతా బాధితుల ఫోన్లో కూడా త్వరలోనే రికవరీ అయ్యేవిధంగా చూస్తాం, కొన్ని ఫోన్లో ఇతర రాష్ట్రాకు వెళ్లడంతో రికవరీ చేయడానికి సమయం పడుతుంది, బాధితులు అధైర్య పడోద్దు అని భరోసానిచ్చారు. తప్పిపోయిన ఫోన్లు అప్పగించినందుకు బాధితులు ఎస్సై జలంధర్ రెడ్డికి పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఎస్సై జలంధర్ రెడ్డి

# బిఆర్ఎస్‌లో వర్గపోరు

- సీఎం దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమంలో బయటపడ్డ విభేదాలు
- వనపర్తిలో మొదలైన గ్రూప్ రాజకీయాలు
- రాజీవ్ చౌక్‌లో జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో ధర్నా

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు1, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీలోనే వర్గ పోరు నడుస్తోంది. గురువారం బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి మహిళ ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేయాలని ఆదేశించడంతో జిల్లా కేంద్రంలో విపక్షమైన బిఆర్ఎస్ పార్టీలో వర్గ పోరు నడిచింది. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఒక వర్గం, మీడియా సెల్ నాయకులు మరో వర్గంగా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీలోనే వర్గ పోరు జరుగుతుందని చర్చ జరుగుతున్న తరుణంలోనే టిఆర్ఎస్ పార్టీలో సైతం వర్గ పోరు నడుస్తుంది అనడానికి ఇది ఒక ప్రధాన కారణం అని చెప్పాలి. ఏ పార్టీ అయినా ఐక్యతతో ఉంటూ ప్రజా సమస్యపై గత విప్పుతారన్న ప్రజల నమ్మకాన్ని ప్రజాప్రతినిలో అపనమ్మకానికి దారి తీయడం ప్రజాస్వామ్యానికి కొని చెయడమేనని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనప్పటికి అధికార పక్ష నాయకులు, విపక్ష నాయకులు వాడి వేడిగా



అంబేద్కర్ చౌరస్తాలో సీఎం దిష్టి బొమ్మ దహనం



జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

మాటల యుద్ధంతో కొనసాగుతున్నారే కానీ క్షేత్రస్థాయిలో ప్రజలకు కావలసిన అభివృద్ధికి బాగటలు వేయాల్సిన బాధ్యత మరచి నడుస్తుండడం విడ్డూరంగుందని పలువురు పెదవి విరుస్తున్నారు.

**హాజరుకాని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి...**

టిఆర్ఎస్ అధిష్టానం ఆదేశించినప్పటికి జిల్లా, పట్టణ నాయకులతో కార్యకర్తలతోనే ఒక వర్గం అంబేద్కర్ చౌకలో, మరో వర్గం రాజీవ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం పలువురికి ఆసక్తికరంగా అనిపించింది. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారే కానీ రోడ్డుపై జరుగుతున్న ధర్నాను దిష్టిబొమ్మ దగ్ధంకి రాక పోవడానికి కారణం ఏంటని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకే పార్టీలో ఉన్న నాయకులకు సఖ్యత లేకనే వర్గపులు నడుస్తున్నట్లు అధికార పార్టీ నాయకులకు ఆరోపిస్తున్నారు. ఇంతసేపు టిఆర్ఎస్ నాయకులు అధికార పక్ష నాయకులను మభ్యపెట్టె ప్రయత్నాలు చేస్తున్నారు గాని ప్రజలకు మంచి అనాలి చెడుని చెడు అనాలని హితువు పలికారు. ప్రచార ఆరబండల కోసం చేస్తున్నారు. తప్ప టిఆర్ఎస్ నాయకులు చేసింది ఏమీ లేదని అధికార పక్ష నాయకులు ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి బెషరతుగా క్షమాపణ చేప్పాలని డిమాండ్ చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు తప్పు పట్టారు. టిఆర్ఎస్ నాయకులు అభద్రత భావంతో ఉండడం వల్లే అసెంబ్లీ సాక్షిగా రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలను విస్మరించలేదని కాంగ్రెస్ పార్టీకి చేసిన మోసాలను గుర్తు చేశారని వారు పేర్కొన్నారు.

# జర్నలిస్టు మధుసూదన్‌రెడ్డిపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 01 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాబిజినేపల్లి మండల ఒపత్రిక పాత్రికేయుడు మధుసూదన్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని జిల్లా ఎస్పీకి జర్నలిస్టులు గురువారం వినతి పత్రం అందించారు. కక్ష్య సాధింపులో భాగంగా అక్రమ కేసులు పెట్టారని, అట్టి కేసులను ఎత్తివేయాలని నాగం కర్నూల్ జిల్లా కే ంద్రానికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌కు వినతి పత్రం అందించి సంఘటనకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. ఇందుకు సంబంధించి వివరాలు...వెల్గొండ గ్రామానికి చెందిన ఓ మహిళను పావుగా చేసుకొని కొందరు వ్యక్తులు మధుసూదన్‌రెడ్డిపై కక్ష్య సాధింపుతో పోలీసులకు ఫిర్యాదు చేయించి అక్రమ కేసులు బనాయించారని ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. జర్నలిస్టుగా అతను వార్తలు రాయడాన్ని కొందరు జీర్ణించుకోలేక తప్పుడు కేసులు పెట్టించారని వారు పేర్కొన్నారు. అత్యాచారయత్నం, ఎస్సీ, ఎస్టీ



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు

అట్రాసిటీ కేసులు బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయించారని ఎస్పీ సూచించారు. మధుసూదన్‌రెడ్డికి మద్దతుగా వెల్గొండ గ్రామానికి చెందిన గ్రామస్తులు బిజినేపల్లిలో నిరసన చేసిన విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఎస్పీని కలిసి వినతి పత్రం అందించినవారిలో జర్నలిస్టులు అబ్దుల్లాఖాన్,కందికొండ మోహన్, జెమిని సురేష్, హౌదేకార్ ఉమాశంకర్, పుట్టపాగ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## బ్యాంకుల రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- ఆర్‌బిఐ ఎల్‌డీఓ పల్లవి, డీఆర్‌డీఓ ఉమాదేవి
- పెద్దమందడి ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

పెద్దమందడి ఆగష్టు1 ప్రభాతవార్త: బ్యాంకులు అందించే వివిధ రకాల సేవలను, ఋణాలను సద్వినియోగం చేసుకుని ఖాతాదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆర్‌బిఐ ఎల్‌డీఓ పల్లవి, డీఆర్‌డీఓ ఉమాదేవి సూచించారు. గురువారం ఏపీజీవీబీ బ్యాంకు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐకేసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆర్‌బీఐ ఎల్‌డీఓ పల్లవి, ఎల్‌డీఎం కౌశల్ కిషోర్ పాండే, డీఆర్‌డీఓ ఉమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ బ్యాంకులలో తీసుకున్న ఋణాలను సకాలంలో చెల్లించి తిరిగి అధిక ఋణాలను పొందాలని మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సేవల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, సైబర్ సెక్యూరిటీ గురించి వారు ఖాతాదారులకు వివరించారు. ప్రతి ఖాతాదారుడికి కూడా తప్పనిసరిగా నామిని ఉండేలా చూసుకోవాలని సూచించారు.ఋణాలను సకాలంలో చెల్లించడం తో పాటు బ్యాంకుల్లో పొదుపులు చేసుకోవాలని సూచించారు. ఎఫ్‌ఎలిసి కౌన్సిలర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి



ఒక్కరూ సామాజిక భద్రత పథకాలైనా పీఎంజెజెబీవై, పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఏపీవైలో భాగస్వాములు కావాలని కోరారు. మోసపూరిత కాల్స్ నమ్మకూడదని ఓటీపీలు ఎవరికి కూడా చెప్పకూడదని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం భాషా నాయక్, ఏపీఎం నాగమణి, ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ జ్ఞానేష్ గౌడ్, ఫీల్డ్ ఆఫీసర్స్ అరుణ్‌క్రాంతి,దక్షేశ్వర్‌రెడ్డి,ఎల్‌డీఎంఆఫీస్ సిబ్బంది సాయి కూమార్,ఖాతాదారులు,గ్రామపెద్దలు,బ్యాంకు మిత్రులు పాల్గొన్నారు.

## యావత్ మాదిగజాతి విజయం

- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్



**జడ్చర్ల, ఆగస్టు01 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీం ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని, ఇది యావత్ మాదిగజాతి విజయమని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్ ఒక ప్రకటనలో అన్నారు. ఎస్సీల 30 ఏళ్ల కల నెరవేరిందని, ఎస్సీల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలించిందని మంద కృష్ణ మాదిగకు యావత్ మాదిగ జాతి రుణపడి ఉంటుం దన్నారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి, ఎంపీలు బండిసంజయ్, డికె అరుణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రంగనాయకస్వామి గుట్టకు సౌండ్‌సెట్ వితరణ



**జడ్చర్ల, ఆగస్టు 01 ప్రభాతవార్త:** శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా బాదేపల్లి రంగనాయకస్వామి పెద్దగుట్టకు మాజీ మంత్రి సీ లక్ష్మారెడ్డి సహకారంతో సౌండ్ సిస్టంను అందజేసినట్లు నాయకులు తెలిపారు. ఈమేరకు గురువారం రంగనాయకస్వామి ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులకు సౌండ్ సిస్టంను పెద్దగుట్టపై అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల మురళి, శ్రీకాంత్, నరసింహ,శశికిరణ్,కమిటీ అధ్యక్షుడు రాంరెడ్డి,విక్కీ,అంజిబాబు, శ్రీనివాస్‌యాదవ్,శివ, సురేశ్,నరేష్, భరత్,సంతోష్,శ్రీను,ఉదండాపూర్‌శ్రీను,బాలు, యాదయ్య పాల్గొన్నారు.

## నేటి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం వాయిదా

**ఉప్పునుంతల,ఆగస్టు 01 ప్రభాతవార్త:** నేడు జరగనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాధికారులు తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లం సబ్జెక్టులకు ఆయా కాంప్లెక్స్‌లలో ఆగస్టు 2న నిర్వహించుకోవాల్సి ఉండగా సమావేశాలను ఈనెల5 వరకు మార్పు చేసినట్లు తెలిపారు.తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌కు సంబధించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఈనెల 5న నిర్వహించుకోవాలని సూచించారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ మార్పును గమనించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

## అమిస్తాపూర్‌లో వృద్ధుడి మృతి

**భూత్పూర్,ఆగస్టు 1,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన కటికె శంకర్‌జీ(62)అనే వృద్ధుడు తన ఇంట్లోని టైల్స్(బండలు)పై జారీ కింద పడి తలకు బలమైన గాయాలతో మృతి చెందినట్లు భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.ఎస్సై కథనం ప్రకారం అమిస్తాపూర్‌కు చెందిన శంకర్‌జీ కుమారుడు మహేష్,భార్య ఈ నెల 27న బోనాల పండుగ కోసం వెళ్లగా శంకర్‌జీ ఇంట్లో ఒక్కడే ఉండి టైల్స్‌పై జారీ తలకు తీవ్రమైన గాయాలతో మృతి చెందాడు.మృతి చెందిన నాలుగైదు రోజులైన ఇంట్లో ఎవరూ లేనికారణంగా మృతదేహం కుళ్లి వాసన రావడంతో పసిగట్టిన ఇరుగుపొరుగువారు సమాచారం అందివ్వగా,గురువారం రోజు ఉదయం తలుపులు తెరిచి చూడగా తన తండ్రి శవమై కన్పించాడని,నాలుగైదు రోజులైన కారణంగా శవం కుళ్లినట్లు కన్పించిందని మృతుని కుమారుడు మహేష్‌పీఎస్‌లో ఫిర్యాదు చేశాడని,తన తండ్రి తరచూ కల్లు(మద్యం)తాగే అలవాటుండేదని,ఈ క్రమంలో కల్లుసేవించి ఇంట్లో కింద పడి ఉంటాడని మృతుని కుమారుడు మహేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.మృతుని కుమారు డు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారు సరిచేసుకోవడానికి దరఖాస్తుల స్వీకరణ

### ఎంపిడిఓ మోహన్‌లాల్

**ఉప్పునుంతల,ఆగస్టు 01 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు సరి చేసుకోవడానికి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఓ మోహన్‌లాల్ తెలిపారు. 200ల యూనిట్ వరకు ఉచిత విద్యుత్ కోసం చేసుకున్న వారికి జీరో బిల్లు రానివారు తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఓ తెలిపారు. అదేవిధంగా గ్యాస్ సిలిండర్ 500ల సబ్సిడి రాని లబ్దిదారులు వెంటనే స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద లబ్దిదారుని ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకం, గ్యాస్ సిలిండర్ బుక్, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నప్పుడు అధికారులనుంచి అందజేసిన రశీదును జిరాక్స్ కాపీలను జతపరిచి ఎంపిడిఓ కార్యాలయంలో దరఖాస్తులను చేసుకోవాలని ఎంపిడిఓ సూచించారు.

## సురక్షితమైన మంచినీటిని అందించాలి

**ఉట్కూర్,ఆగస్టు 01 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మొగ్దుంపూర్ గ్రామంలో దాదాపు 15 రోజుల నుంచి నల్ల ద్వారా కలుషితమైన నీరు వస్తుందని దీని ద్వారా ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారని ఎన్నిసార్లు ఉన్నత అధికా రులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తక్షణమే స్పందించి మరమ్మ తులు చేపట్టి ప్రజలను విషజ్వరాల నుంచి కాపాడాలని సామాజిక ఉద్యమ కారుడు కె. నర్సింలు డిమాండ్ చేశారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**గోపాల్‌పేట ఆగష్టు 1 ప్రభాతవార్త:** గోపాల్ పేట మండలం పోల్కంపాడ్ గ్రామానికి చెందిన పత్రిక విలేకరి రాధాకృష్ణ రెడ్డి తండ్రి గోపాల్ రెడ్డి గుండె పోటుతోమృతి చెందిన విషయం తెలుసుకున్న స్టేట్ ఎపిపిసి కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి, వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గోపాల్ పేట మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, పెబ్బేరు మండల అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, సహదేవుడు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కలిసిన జిల్లెల ఆదిత్యరెడ్డి

**వనపర్తి రూరల్ ఆగష్టు 1 ప్రభాతవార్త:** గురువారం నాడు వనపర్తి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారిగా ఆదర్శ్ సురభిని కలిసిన ఎపిపిసి స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి కలెక్టర్‌కి శాలువతో సన్మానం చేసి, శుభాకాంక్షలు విపక్ష నాయకులు తెలిపారు. ఈ కార్యమ్రంలో కాంగ్రెస్ నాయకులు దివాకర్, రోహిత్, ప్రవీణ్‌రెడ్డి, బాబా, భాస్కర్, రామేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరం

**అమరచింత ఆగష్టు 1 ప్రభాతవార్త:** పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ నర్మాదా అన్నారు. గురువారం అమరచింత మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన గంటకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పిల్లలకు భవిష్యత్తులో ఎలాంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని ఆమె అన్నారు. గర్భిణిలకు బాలింతలకు ఆశ వర్కర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని అలాగే గర్భిణి, బాలింతలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండే విధంగా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పలు సూచనలు చేయాలని ఆమె వారిని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నికిత,ఆశ వర్కర్లు సంధ్య, సుధా, అంగాన్వాడీ టీచర్లు నాగేంద్రమ్మ, బాలేశ్వరి, రాధిత తదితరులు పాల్గొన్నారు.

## మెస్ ఛార్జీలు పెంచాలి

- బిఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.సిద్ధార్థ

**వనపర్తి టౌన్ ఆగష్టు1 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని పట్టణ కళాశాల హాస్టల్ విద్యార్థులతో నిరసన తెలియజేయడం జరిగింది. విద్యార్థులను కలిసి హాస్టల్ సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వనపర్తి బి.ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు డి.సిద్ధార్థ బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బి.ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కో విద్యార్థికి 2500, కాస్మోటిక్ ఛార్జెస్ 250 రూపాయలు పెంచా లని అలాగే శిథిలా వ్యవస్థకు చేరిన హాస్టల్ భవనాలను నూతనంగా నిర్మించా లని, సొంత భవనాలు లేని హాస్టళ్లను సొంత భవనాలు నిర్మించాలని పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెస్ ఛార్జీలు పెంచాలని ప్రభుత్వ పాఠశాల లో పరిశుద్ధ కార్మికులను నియమించాలని కచ్చితంగా మెస్ ఛార్జీలు పెంచాలని వారుప్రభుత్వం డిమాండ్ చేశారుత్వరలోనే హాస్టల్ సమస్యలను పరిష్కరించా లని లేనియెడలకలెక్టరేట్‌ముట్టడిస్తామనిఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)



జడ్చర్లలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

లత,పుష్పలత, ఆండాలు, కోట్ల ప్రశాంత్‌రెడ్డి, దేవా, నందకిషోర్, ఉమాశంకర్ గౌడ్, రఘురాంగౌడ్, నాయకులు రామ్మోహన్, కరాటే శ్రీను,నాగిరెడ్డి, బీకేఆర్, కరాటే తదితరుల పాల్గొన్నారు.

### సీఎం డౌన్ డౌన్ నినాదాలతో హోరెత్తిన గద్వాల..

**గద్వాల,ఆగస్టు 1,ప్రభాతవార్త:** అసెంబ్లీలో మహిళలపై సిఎం, డిప్యూటీ సిఎం వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయంటూ నిరసనగా గురువారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు సిఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. మాజీ జడ్పీటీసీ జిల్లా బిఆర్ఎస్ నాయకులు బాసు శ్యామల, హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు గురువారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌక్‌లో మహిళా శాసనసభ్యురాలు మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రా రెడ్డిని,సునీత లక్ష్మారెడ్డిని ఉద్దేశించి ముఖ్యమంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ముఖ్యమంత్రి దిష్టబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వెంటనే బిఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలతో పాటు తెలంగాణలో ఉన్న మహిళాలోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట రాములు, అంగడ బసవరాజు, మోనేష్,తిరుమలేష్ నాయుడు, రాజు నాయుడు, బాసు గోపాల్, టవర్ ముక్బాల్, తప్పెట్ల తిమ్మప్ప, గట్టు మాజీ ఎంపిటిసి ఎస్రాము, బొజ్జయ్య, ముని, హుస్సేన్, గట్టు, వెంకటేష్, కంగారు తిమ్మప్ప, ప్రహ్లద్,అన్వార్,గోపి,లోకేష్,వీరేష్,బలిగెర,ఏసన్న,దోర్నాలవీరేష్ పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం.. పచ్చదనం విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు గ్రామాలు మరియు పట్టణ ప్రాంతాలను ప్రతి రోజు పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆమె ఆదేశించారు. మొక్కల పెంపకాన్ని గృహ స్థాయి మరియు సమాజ స్థాయిలో చేపట్టేందుకు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. 5 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలను నాగర్‌కర్నూల్ జిల్లాలో విజయవంతంగా నిర్వర్తించి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో కొనసాగిస్తామని, 5 రోజుల కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో అన్ని శాఖల అధికారులతో సమ న్వయం చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వర్తిస్తామని కలెక్టర్ బాదవత్ సంతోష్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారికి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ మొదటి రోజు స్థానిక ప్రజలతో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ర్యాలీలు, సమావే శాలు ఏర్పాటు చేయాలని, ఇందులో యువకులను, మహిళా సంఘాలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. మొక్కలు నాటాలని పాఠశాలల్చ్వు విద్యార్థులతో శానిటేషన్, ప్లాంటేషన్ పర్సనల్ హైజిన్ సీజనల్ డిజీజెస్ ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగె నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, గ్రామాల్లోని పౌరులు, గ్రామాధికారులు, భాగస్వాములను చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



మహబూబ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు దత్తేంద్ర, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, జర్నలిస్టులు మణిప్రసాద్, వెంకట్. **- మహబూబ్‌నగర్, ఆగస్టు1, ప్రభాతవార్త॥**